12-03-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

" మధురమైన పిల్లలారా - మీరు తండ్రి చేయి పట్టుకున్నారు, మీరు గృహస్థ వ్యవహారములో ఉంటున్నా తండ్రిని స్మృతి చేస్తూ చేస్తూ తమోప్రధానము నుండి సతోప్రధానంగా తయారవుతారు "

ప్రశ్న :- పిల్లలైన మీలో ఏ ఉత్సాహముండాలి ? హృదయ సింహాసనాధికారులుగా అయ్యేందుకు విధి ఏది ?

జవాబు :- జ్ఞానసాగరులైన తండ్రి ప్రతి రోజు జ్ఞానరత్నాలతో పళ్లెములు నింపి నింపి ఇస్తున్నారనే ఉల్లాసము సదా ఉండాలి. ఎంత యోగములో ఉంటారో బుద్ధి అంత బంగారు(శుద్ధం)గా అవుతూ ఉంటుంది. ఈ అవినాశి జ్ఞానరత్నాలే మీ జతలో వస్తాయి. సింహాసనాధీశులుగా అయ్యేందుకు తల్లిదండ్రులను పూర్తిగా అనుసరించండి. వారి శ్రీమతమును అనుసరించండి. ఇతరులను కూడా మీ సమానంగా చేయండి.

ఓంశాంతి. ఆత్మిక పిల్లలు ఈ సమయములో ఎక్కడ కూర్చొని ఉన్నారు? ఆత్మిక తండ్రి విశ్వవిద్యాలయములో లేక పాఠశాలలో కూర్చొని ఉన్నారని అంటారు. మనము ఆత్మిక తండ్రి ఎదుట కూర్చొని ఉన్నామని బుద్ధిలో ఉంది. ఇప్పుడు ఆ తండ్రి మనకు సృష్టి ఆదిమధ్యాంతాల రహస్యాన్ని అర్థం చేయిస్తున్నారు అనగా భారతదేశపు ఉత్థాన-పతనాలు ఎలా జరుగుతాయో కూడా తెలుపుతారు. పవిత్రంగా ఉండిన భారతదేశము ఇప్పుడు పతితమైపోయింది. భారతదేశము తలమానికంగా ఉండేది. అయితే దానిని ఎవరు గెలుపొందారు? రావణుడు గెలుచుకున్నాడు. రాజ్యము పోగొట్టుకుంటే పతనము చెందినట్లు కదా. ఇప్పుడు రాజులెవ్వరూ లేరు. ఒకవేళ ఉండినా పతితులుగానే ఉన్నారు. ఈ భారతదేశములోనే సూర్యవంశ మహారాజులు, మహారాణులు ఉండేవారు. సూర్యవంశ మహారాజులు, చంద్రవంశ రాజులు ఉండేవారు. ఈ విషయాలన్నీ ఇప్పుడు మీ బుద్ధిలో ఉన్నాయి. ప్రపంచములో ఈ విషయాలు ఇతరులెవ్వరికీ తెలియవు. ఆత్మిక తండ్రి మమ్ములను చదివిస్తున్నారని పిల్లలైన మీకు తెలుసు. మనము ఆత్మిక తండ్రి చేయి పట్టుకున్నాము. మనము భలే గృహస్థ వ్యవహారములో ఉన్నా ఇప్పుడు సంగమ యుగములో నిలబడి ఉన్నామని బుద్ధిలో ఉంది. పతిత ప్రపంచము నుండి మనము పావన ప్రపంచములోకి వెళ్తాము. కలియుగము పతిత యుగము, సత్యయుగము పావన యుగము. పతిత మానవులు పావన మనుష్యుల ఎదుటకు వెళ్లి నమస్కరిస్తారు. వారు కూడా భారతదేశములోని మనుష్యులే. కానీ వారు దైవీగుణాలు కలిగినవారు. ఇప్పుడు తండ్రి ద్వారా మనము కూడా ఇటువంటి దైవీ గుణాలను ధారణ చేస్తున్నామని పిల్లలైన మీకు తెలుసు. సత్యయుగములో ఈ పురుషార్థము చెయ్యము. అక్కడ ప్రాలబ్ధముంటుంది. ఇక్కడ పురుషార్థము చేసి దైవీగుణాలు ధారణ చేయాలి. మనము బాబాను స్మృతి చేసి తమోప్రధానము నుండి సతోప్రధానంగా ఎంతవరకు అయ్యాము? అని సదా స్వయాన్ని పరిశీలించుకుంటూ ఉండాలి. తండ్రిని ఎంత స్మృతి చేస్తారో, అంత సతోప్రధానంగా అవుతారు. తండ్రి ఏమో సదా సతోప్రధానంగానే ఉంటారు. ఇప్పుడిది పతిత ప్రపంచము, పతిత భారతదేశము. పావన ప్రపంచములో పావన

భారతదేశముండేది. ప్రదర్శనీలో మీ వద్దకు అనేక ప్రకారాల మనుష్యులు వస్తారు. భోజనము ఎలా అవసరమో అలా ఈ వికారాలు కూడా భోజనమే, అవి కూడా అంత అవసరమే, అవి లేకుంటే చనిపోతాము అని కొంతమంది అంటారు. అలాంటిదేమీ లేదు. సన్యాసులు పవిత్రంగా ఉంటారు, వారేమైనా మరణిస్తున్నారా? ఇలా మాట్లాడే వారిని అజామిళుని వంటి మహాపాపాత్ములని భావించాలి. ఈ వికారాలు లేకుంటే మీరు మరణిస్తారా? దీనిని భోజనానికి పోలుస్తున్నారే! అని అడగాలి. స్వర్గములోకి వచ్చేవారు సతోప్రధానంగా ఉంటారు. ఆ తర్వాత సతో, రజో, తమోలోకి వస్తారు కదా. వెనుక వచ్చే ఆత్మలు వికారాలు లేని ప్రపంచాన్ని చూడను కూడా చూడరు. అందువలన అటువంటి ఆత్మలు వికారాలు లేకుండా మేము ఉండలేమని అంటారు. సూర్యవంశములోకి వచ్చేవారి బుద్ధికి ఇది సత్యమైన విషయము అని వెంటనే తోస్తుంది. స్వర్గములో వికారాలకు నామ-రూపాలు కూడా ఉండవు. రకరకాల మనుష్యులు రకరకాలుగా మాట్లాడుతూ ఉంటారు. పుష్పాలుగా ఎవరెవరు అవుతారో మీకు తెలుసు. కొంతమంది ముళ్ళుగానే ఉండిపోతారు. స్వర్గాన్ని పుష్పాలతోట అని అంటారు. ఇది ముళ్ళ అడవి. ముళ్ళలో కూడా అనేక ప్రకారాలు ఉంటాయి కదా. మనము పుష్పాలుగా అవుతున్నామని ఇప్పుడు మీకు తెలుసు. ఈ లక్ష్మీనారాయణులు సదా గులాబీ పుష్పాలే. వీరిని పుష్ప రాజులు అని అంటారు. దైవీ పుష్పాల రాజ్యము కదా. వారు కూడా తప్పకుండా పురుషార్థము చేసి ఉంటారు. చదువు ద్వారా తయారయ్యారు కదా.

మనమిప్పుడు ఈశ్వరీయ పరివారానికి చెందిన వారిగా అయ్యామని మీకు తెలుసు. మొదట ఈశ్వరుడంటే తెలియనే తెలియదు. తండ్రి వచ్చి ఈ కుటుంబాన్ని తయారు చేశారు. తండ్రి మొదట స్త్రీని దత్తత తీసుకుని ఆ తర్వాత వారి ద్వారా పిల్లలను రచిస్తాడు. బాబా కూడా ఇతనిని దత్తు తీసుకున్నాడు. ఇతని ద్వారా పిల్లలను రచించారు. వీరంతా బి.కె.లు కదా. ఈ సంబంధము ప్రవృత్తి మార్గానికి చెందినది. సన్యాసులది నివృత్తి మార్గము. అందులో మమ్మా - బాబా అని అనరు. మీరు ఇక్కడ మమ్మా-బాబా అని పిలుస్తారు. ఇతర సత్సంగాలన్నీ నివృత్తి మార్గానికి చెందినవి. ఈ ఒక్క తండ్రిని మాత్రమే మీరు మాత-పిత అని పిలుస్తారు. భారతదేశములో పవిత్ర ప్రవృత్తి మార్గముండేదని తండ్రి కూర్చొని అర్థం చేయిస్తున్నారు. ఇప్పుడు అపవిత్రమైపోయింది. నేను మళ్ళీ అదే ప్రవృత్తి మార్గమును స్థాపన చేస్తున్నాను. మన ధర్మము చాలా సుఖమునిచ్చేదని మీకు తెలుసు. మనము మళ్ళీ పాత ధర్మానికి చెందినవారి సాంగత్యము ఎందుకు చెయ్యాలి! మీరు స్వర్గములో ఎంతో సుఖంగా ఉంటారు. వజ్రవైడూర్యాల భవనాలుంటాయి. ఇక్కడ అమెరికా, రష్యా దేశాలలో ఎంతటి ధనవంతులుగా ఉన్నా స్వర్గములో ఉన్నంత సుఖముండదు. ఇక్కడ బంగారు ఇటుకలతో భవనాలు ఎవ్వరూ కట్టించలేరు. స్వర్గము వంటి సుఖముండదు. బంగారు మహళ్ళు సత్యయుగములో మాత్రమే ఉంటాయి. ఇక్కడ బంగారు లేనే లేదు. స్వర్గములో ప్రతి చోట వజ్రవైడూర్యాలు పొదిగించబడి ఉంటాయి. ఇక్కడ వజ్రాల ధర ఎంతగానో పెరిగిపోయింది. ఇదంతా మట్టిలో కలిసిపోతుంది. నూతన ప్రపంచములో మళ్ళీ నూతన గనులు నిండుగా ఉంటాయని బాబా అర్థము చేయించారు. ఇప్పుడవన్నీ ఖాళీ అవుతూ ఉంటాయి. సాగరుడు వజ్రవైఢూర్యాల పళ్ళెములనిచ్చారని అంటారు. అక్కడ లెక్కలేనన్ని వజ్ర వైడూర్యాలు దొరుకుతాయి. సాగరాన్ని కూడా దేవతా రూపంగా భావిస్తారు. తండ్రి జ్ఞానసాగరుడని మీకు తెలుసు. జ్ఞానసాగరుడైన తండ్రి మనకు ప్రతి రోజు జ్ఞానరత్నాల పళ్ళెములను నింపి ఇస్తున్నారని

సదా ఉల్లాసంగా ఉండాలి. ఆ సముద్రాలన్నీ నీటిసాగరాలు. తండ్రి పిల్లలైన మీకు జ్ఞానరత్నాలనిస్తున్నారు. వాటిని మీరు బుద్ధిలో నింపుకుంటారు. ఎంత యోగములో ఉంటారో, బుద్ధి అంత బంగారు సమానంగా అవుతూ ఉంటుంది. ఈ అవినాశి జ్ఞాన రత్నాలనే మీరు వెంట తీసుకెళ్తారు. తండ్రి స్మృతి మరియు ఈ జ్ఞానము ముఖ్యమైనవి.

పిల్లలైన మీలో చాలా ఉల్లాసముండాలి. తండ్రి కూడా గుప్తమైనవారు, అలాగే మీరు కూడా గుప్తమైన సైన్యము. అహింసాయుత గుప్త యోధులని అంటారు కదా. ఫలానావారు చాలా శక్తిశాలి యోధులని అంటారు. కానీ నామ-రూపాలు తెలియవు అని అనేందుకు వీలు లేదు. ప్రభుత్వము వారి వద్ద ఒక్కొక్కరి పేరు, వారి గుర్తులు పూర్తిగా ఉంటాయి. గుప్త యోధులు, అహింసకులు అనేవి మీ గుర్తులే, మీ పేర్లే. అన్నింటికంటే మొట్టమొదటి హింస వికారము. ఇదే ఆదిమధ్యాంతాలు దుఃఖమునిస్తుంది. అందుకే "ఓ పతితపావనా! మీరు వచ్చి పతితులైన మమ్ములను పావనంగా చేయండి" అని అంటారు. పావన ప్రపంచములో ఒక్కరు కూడా పతితులు ఉండరు. ఇప్పుడు మనము భగవంతుని నుండి వారసత్వము తీసుకునేందుకు భగవంతుని పిల్లలుగా అయ్యామని మీకు తెలుసు. కానీ మాయ కూడా తక్కువైనదేమీ కాదు. మాయ ఒక్కసారిగా చెంపదెబ్బ వేస్తే, పోయి మురికి కాలువలో పడ్తారు. వికారాలకు వశమయ్యే వారి బుద్ధి ఒక్కసారిగా సమాప్తమైపోతుంది. పరస్పరము దేహధారుల పై ప్రీతిని ఎప్పుడూ ఉంచకండి అని తండ్రి ఎంతగానో అర్థం చేయిస్తున్నారు. మీరు ఒక్క తండ్రి పైనే ప్రీతిని ఉంచాలి. ఏ దేహధారినీ ప్రేమించరాదు. దేహము లేని విచిత్రమైన ఆ తండ్రినే ప్రేమించండి. తండ్రి ఎంతగా అర్థం చేయిస్తున్నా అర్థమే చేసుకోరు. అదృష్టములో లేకుంటే, పరస్పరము దేహాలలో చిక్కుకుంటారు. మీరు కూడా ఆత్మలేనని, యోగులేనని బాబా ఎంతగానో అర్థం చేయిస్తున్నారు. ఆత్మ-పరమాత్మల రూపము ఒక్కటిగానే ఉంటుంది. ఆత్మలు చిన్నవిగా - పెద్దవిగా ఉండవు. ఆత్మ అవినాశి, ప్రతి ఒక్కరి పాత్ర డ్రామాలో నిశ్చయింపబడి ఉంది. ఇప్పుడు అనేకమంది మనుష్యులున్నారు. తర్వాత కేవలం 9-10 లక్షల మంది మాత్రమే ఉంటారు. సత్యయుగ ఆరంభములో ఎంతో చిన్న వృక్షముగా ఉంటుంది. ప్రళయము ఎప్పుడూ జరగదు. మనుష్యమాత్రుల ఆత్మలన్నీ మూలవతనములో ఉంటాయని మీకు తెలుసు. ఆత్మల వృక్షము కూడా ఉంది. విత్తనము వేస్తే దాని నుండి వృక్షమంతా వెలువడ్తుంది కదా. మొట్టమొదట రెండు ఆకులు వస్తాయి. ఇది కూడా అనంతమైన వృక్షము. సృష్టి చక్రమును చూపించి అర్థము చేయించడం ఎంతో సులభము. ఆలోచించి చూడండి. ఇప్పుడుండేది కలియుగము. సత్యయుగములో ఒకే ధర్మముండేది. అక్కడ చాలా కొద్దిమంది మనుష్యులే ఉంటారు. ఇప్పుడు ఎంతమంది మనుష్యులు, ఎన్ని ధర్మాలు ఉన్నాయి! ఇంతమంది మొదట లేనే లేరు. వారంతా ఎక్కడకు వెళ్తారు? ఆత్మలన్నీ పరంధామానికి వెళ్ళిపోతాయి. మీ బుద్ధిలో మొత్తం జ్ఞానమంతా ఉంది. తండ్రి ఎలా జ్ఞానసాగరులో మిమ్ములను కూడా అలాగే తయారు చేస్తారు. మీరు చదవుకొని ఈ పదవిని పొందుతారు. తండ్రి స్వర్గ రచయిత అయినందున స్వర్గ వారసత్వమును భారతీయులకే ఇస్తారు. మిగిలిన వారందరినీ ఇంటికి వాపస్ తీసుకెళ్తారు. తండ్రి అంటున్నారు - పిల్లలైన మిమ్ములను చదివించేందుకు నేను వచ్చాను. ఎంత పురుషార్థము చేస్తారో అంత పదవి పొందుతారు. శ్రీమతమును ఎంత బాగా అనుసరిస్తారో అంత శ్రేష్ఠంగా అవుతారు. ఆధారమంతా పురుషార్థము పైనే ఉంది. మమ్మా-బాబాల హృదయ సింహాసనాధికారులుగా అయ్యేందుకు తల్లిదండ్రులను పూర్తిగా

అనుసరించండి. సింహాసనాధికారులుగా అయ్యేందుకు వారు నడచినట్లు నడవండి. ఇతరులను కూడా మీ సమానంగా తయారు చేయండి. బాబా అనేక రకాల యుక్తులు తెలుపుతున్నారు. బ్యాడ్జిని చూపించి ఎవరికైనా మీరు బాగా అర్థం చేయించవచ్చు. పురుషోత్తమ మాసము వస్తే చిత్రాలు ఉచితంగా పంచమని బాబా చెప్తున్నారు. బాబా బహుమతులను ఇస్తారు. మీ చేతికి ధనము వస్తే బాబాకు కూడా ఖర్చులుంటాయి కదా అని అర్థం చేసుకొని వెంటనే బాబాకు పంపిస్తారు. అందరి ఇల్లు ఒక్కటే కదా. ట్రాన్స్లైటు చిత్రాల ప్రదర్శని తయారైతే దానిని చూచేందుకు చాలామంది వస్తారు. అది పుణ్యకార్యము కదా. మనుష్యులను ముళ్ళ నుండి పుష్పాలుగా, పాపాత్మలను పుణ్యాత్మలుగా చేస్తారు, దీనిని విహంగ మార్గమని అంటారు. ప్రదర్శినీలో స్టాలు తీసుకోవడం వలన చాలామంది వస్తారు. ఖర్చు తక్కువగా ఉంటుంది. స్వర్గ రాజ్యమును తండ్రి నుండి ఖరీదు చేసేందుకు మీరు ఇక్కడకు వస్తున్నారు. స్వర్గ రాజ్యమును ఖరీదు చేసేందుకు చిత్రప్రదర్శనకు కూడా వస్తారు. ఇది దుకాణము కదా.

తండ్రి చెప్తున్నారు - ఈ జ్ఞానము ద్వారా మీకు చాలా సుఖము లభిస్తుంది. కనుక బాగా చదువుకొని, పురుషార్థము చేసి ఫుల్‌పాస్(సంపూర్ణ ఉత్తీర్ణులు) అవ్వాలి. తండ్రే స్వయంగా కూర్చొని తన పరిచయాన్ని, రచన యొక్క ఆదిమధ్యాంతాల పరిచయాన్ని తెలుపుతున్నారు. ఇతరులెవ్వరూ తెలుపలేరు. ఇప్పుడు తండ్రి ద్వారా మీరు త్రికాలదర్శులుగా అవుతారు. తండ్రి అంటున్నారు - నేను ఎవరో ఎలా ఉన్నానో, యథార్థ రీతిగా ఎవ్వరికీ తెలియదు. మీకు కూడా నంబరువారుగా తెలుసు. యథార్థంగా తెలుసుకుంటే నన్ను ఎప్పుడూ వదలిపెట్టరు. ఇది చాలా మంచి చదువు. భగవంతుడే కూర్చుని చదివిస్తున్నారు. నేను మీకు వినయ విధేయతలు గల సేవకుడను. తండ్రి, టీచరు ఇరువురూ కూడా విధేయత గల సేవకులుగా ఉంటారు. డ్రామాలో నా పాత్రనే అలా ఉంది. మళ్ళీ అందరినీ నా వెంట తీసుకెళ్తాను. శ్రీమతమును అనుసరిస్తూ గౌరవ పూర్వకంగా ఉత్తీర్ణులవ్వాలి. ఈ చదువు చాలా సులభమైనది. చదివించేవారు(బ్రహ్మాబాబా) అందరికంటే వృద్ధులు. శివబాబా అంటున్నారు - నేను వృద్ధుడను కాను. ఆత్మ ఎప్పుడూ ముసలిగా కాదు, కానీ రాతిబుద్ధిగా అవుతుంది. నాది పారసబుద్ధి, అందుకే మిమ్ములను నేను పారసబుద్ధిగా తయారు చేసేందుకు వస్తాను. కల్ప-కల్పము ఒక్కసారి మాత్రమే వస్తాను. లెక్కలేనన్ని సార్లు మిమ్ములను చదివిస్తాను. అయినా మీరు నన్ను మర్చిపోతారు. సత్యయుగములో ఈ జ్ఞానము అవసరమే ఉండదు. తండ్రి ఎంతో మంచి రీతిగా అర్థం చేయిస్తున్నారు. అటువంటి తండ్రికి విడాకులు ఇచ్చేస్తారు. అందుకే మహామూర్ఖులను చూడాలనుకుంటే ఇక్కడే చూడమని చెప్తారు. స్వర్గ వారసత్వము ఎవరి ద్వారా లభిస్తుందో అటువంటి తండ్రిని కూడా వదిలేస్తారు. తండ్రి చెప్తున్నారు - మీరు నా మతమును అనుసరిస్తే అమరలోకములో విశ్వ మహారాజులుగా అవుతారు. ఇది మృత్యులోకము. మేమే పూజ్య దేవీ దేవతలుగా ఉండేవారమని పిల్లలకు తెలుసు. ఇప్పుడు మనము ఎలా తయారయ్యాము! పతితులుగా, భికారులుగా అయ్యాము. ఇప్పుడు మళ్ళీ మనమే రాకుమారులుగా అవుతాము. అందరి పురుషార్థము ఏకరసంగా ఉండేందుకు వీలు లేదు. కొంతమంది విడిచిపెట్టి వెళ్ళిపోతారు. కొంతమంది ద్రోహులుగా అవుతారు. ఇటువంటి ద్రోహులు కూడా చాలామంది ఉన్నారు. వారితో కనీసము మాట్లాడను కూడా మాట్లాడరాదు. జ్ఞాన విషయాలు తప్ప ఏ విషయాలు అడిగినా పిశాచితనమని భావించండి. సత్సంగము తేలుస్తుంది, కుసంగము

ముంచుతుంది................ ఎవరు జ్ఞానములో తెలివైనవారుగా ఉంటారో, బాబా హృదయాన్ని అధిరోహించి ఉంటారో వారి సాంగత్యము చేయండి. వారు మీకు మధురాతి మధురమైన జ్ఞాన విషయాలు వినిపిస్తారు. మంచిది.

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము :-

1. దేహములేని విచిత్రమైన తండ్రిని ప్రేమించాలి. ఏ దేహధారి నామ-రూపాలలో బుద్ధిని చిక్కుకోనివ్వరాదు. మాయతో చెంపదెబ్బలు తినకుండా స్వయాన్ని సంభాళించుకోవాలి (రక్షించుకోవాలి).
2. జ్ఞాన విషయాలు తప్ప ఇతర విషయాలు వినిపించే వారి సాంగత్యము చేయరాదు. పూర్తిగా పాసయ్యే పురుషార్థము చేయాలి. ముళ్ళను పుష్పాలుగా మార్చే సేవ చేయాలి.

వరదానము :- " కారణాన్ని నివారణ చేసి చింత నుండి, భయము నుండి ముక్తముగా ఉండే మాస్టర్ సర్వశక్తివాన్ భవ "

వర్తమాన సమయంలో అల్పకాల సుఖముతో పాటు చింత మరియు భయము కూడా ఉండనే ఉన్నాయి. ఎక్కడైతే చింత ఉంటుందో అక్కడ సుఖము ఉండదు, ఎక్కడైతే భయముంటుందో అక్కడ శాంతి ఉండదు. కనుక సుఖముతో పాటు ఈ దు:ఖము-అశాంతులకు కారణము కూడా ఉంది. కానీ మీరు సర్వ శక్తుల ఖజానాలతో సంపన్నమైన మాస్టర్ సర్వశక్తివంతులు, దు:ఖాల కారణాన్ని నివారణ చేసేవారు, ప్రతి సమస్యను సమాధానపరచే సమాధాన స్వరూపులు. అందువలన చింత మరియు భయముల నుండి ముక్తులుగా ఉన్నారు. ఏ సమస్య అయినా మీతో ఆడుకునేందుకు వస్తుంది, భయపెట్టేందుకు కాదు.

స్లోగన్ :- " మీ వృత్తిని శ్రేష్ఠంగా చేసుకుంటే, మీ ప్రవృత్తి స్వతహాగా శ్రేష్ఠమైపోతుంది "